
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
18 నవంబర్ 2026
పేజీలు : 8
Follow :

అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పింఛన్ అందజేస్తాం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర నవంబర్ 17 (జనంసాక్షి):
మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 897 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరి పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.గంగాధర మండలం మధురానగర్ లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే తో కలిసి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండలంలోని 33 గ్రామాలకు చెందిన 897 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర మండలంలో 389 వితంతు, 26 వికలాంగుల, 101 గీత కార్మిక, 75 ఒంటరి మహిళ, 126 చేనేత పెన్షన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లోని అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్ అందజేయడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు ఉచిత సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రామ్, మండల సర్పంచులు మరియు అధికారులు పాల్గొన్నారు.



గత ప్రశ్నా పత్రాలు సాధన చేయాలి
కలెక్టర్ గరిమ అగ్రవాల్

వార్తా లోపలి పేజీలో

అర్హులందరికీ చేయూత పెన్షన్ మంజూరు
కలెక్టర్ గరిమ అగ్రవాల్



నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ



సదాశివనగర్, నవంబర్ 17 (జనంసాక్షి):
అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. సదాశివనగర్ మండలంలోని అశోక్ గార్డెన్స్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన మొత్తం 1,741 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పెన్షన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు అండగా నిలిచే భరోసా అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పేద కుటుంబాల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్ శివారును పరిశీలించిన తహశీల్దార్

జనాభా పెద్దకొడప్గల్ లో.. విస్తీర్ణం బిచ్కుందలో..



పెద్ద కొడప్గల్ నవంబర్ 17 (జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్రంలో మండలాల విభజనకు ముందు పెద్ద కొడప్గల్ గ్రామంతో పాటు మల్కాపూర్ శివారు బిచ్కుంద మండలంలో ఉండేది. విభజన అనంతరం పెద్ద కొడప్గల్ ను మండలంగా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పెద్ద కొడప్గల్ మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామాలను మండలంలో విలీనం చేయగా కూత వేటు దూరంలోని (సుమారు 1 కిలోమీటర్) మల్కాపూర్ శివారు మాత్రం నేటికీ బిచ్కుంద మండలంలో కొనసాగుతుంది. పెద్ద కొడప్గల్ గ్రామంలో నివసిస్తున్న మల్కాపూర్ రైతులు అధికార పనులను నిమిత్తం అనగా వ్యవసాయం, పోలీస్, విద్యుత్, రెవెన్యూ శాఖల పనుల నిమిత్తం బిచ్కుంద మండల కేంద్రానికి (సుమారు 25 కిలోమీటర్లు దూరం) వెళ్లాల్సి వస్తుంది. ఇబ్బందులకు గురవుతున్న రైతులు ఇటీవల కామారెడ్డి కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణిలో తమ శివారును పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో పూర్తిగా విలీనం చేయమని దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం తహశీల్దార్ రాజశేఖర్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్కాపూర్ శివారు రైతులు గతంలో మల్కాపూర్ గ్రామం ఉండేదని నాటి ఆనవాళ్లను (హనుమాన్ మందిరం, ఊరడమ్మ విగ్రహం, బురుజు) తహశీల్దార్ రాజశేఖర్ కు చూపించారు. ఉన్నతాధికారు లకు నివేదికను అందజేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిబ్బంది రమేష్, రాజు, రైతులు, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

బోధన్ మండల స్పెషల్ అధికారి ఆర్. భాస్కర్

బోధన్, నవంబర్ 17 (జనంసాక్షి) :
బోధన్ పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని బోధన్ మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఆర్. భాస్కర్ సూచించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం బోధన్ సమావేశపు హాలులో మండలం లోని అర్బన్, రూరల్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానో పాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఆర్. భాస్కర్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో విద్యార్థులందరూ ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకాని విద్యార్థులను గుర్తించి, వారి ఇళ్లకు స్వయంగా వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి, విద్యార్థులు తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా యూడిఐఎస్ఈ ప్లస్ పోర్టల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని, ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అపార్ ఐడిజనరేట్ చేయించాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల హాజరు, విద్యార్థుల సంఖ్య, ఇతర పాఠశాల సంబంధిత వివరాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు, సిఆర్పిలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ తమ పరిధిలోని ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో బోధన్ మండల విద్యాధికారి నాగయ్య, అందాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, పెంటాకుర్దు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిలు విజయ్, ఇతరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ జెడ్పిటిసి పూర్మాని మంజుల, రామ్ లింగారెడ్డి



తంగళ్ళపల్లి,నవంబర్ 17, జనం సాక్షి.కాంగ్రెస్ పార్టీకి,క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ జెడ్పిటిసి పూర్మాని మంజుల, రామ్ లింగారెడ్డి దంపతులు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కు తమ రాజీనామాను పంపించినట్లు వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నామని,అనివార్య కారణాలవల్ల మేము కాంగ్రెస్ పార్టీని విడాలని నిర్ణయించు కున్నామన్నారు. పార్టీలో నాకు సహకరించిన పార్టీ పెద్దలకు ,నాయ కులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాలామృతం ప్లస్ పై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన

ఆరేళ్ల లోపు పిల్లల ఎదుగుదలే ముఖ్యం :డిపిఓ వీరభద్రయ్య



తంగళ్ళపల్లి, నవంబర్ 17, జనం సాక్షి.తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్ లో బాలామృతం పై పది నిమిషాలు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి.పి.ఓ వీరభద్రయ్య,ఎం.పీ.డీ.వో రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు బాలామృతం ప్లస్ ప్రాధాన్యత, ప్రయోజనాలను తెలిపారు. చంటి పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించేందుకు ప్రతినెల తప్పనిసరిగా బరువు తూకం వేసి చూడాలని సూచించారు. ఆరేళ్ల లోపు ఉన్న పిల్లలు జీవితంలో అత్యంత కీలకమని ఈ దశలోనే మెదడు, శరీరం ఎదుగుదల వేగంగా జరుగుతుందని వెల్లడించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారిని చురుకుగా ఉంచాలని ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడీ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంచ శ్రీనివాస్ రెడ్డి, సూపర్వైజర్ సౌజన్య, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కేత్ బచావో అభియాన్-ఎల్ నినో పై రైతులకు అవగాహన

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు శ్రీనివాస్ రెడ్డి



తంగళ్ళపల్లి నవంబర్ 17 జనం సాక్షి.తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఏఓ సంజీవ్ ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్, ఎల్ నినో కార్యక్రమం పై రైతులకు అవగాహన సదస్సును చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులే దేశానికి వెన్నుముకని రైతులు బాగుంటేనే గ్రామం,దేశం బాగుంటుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు మల్లాలని రసాయన ఎరువులు ,పురుగుల మందు వాడకం తగ్గించి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. వరి కోతల అనంతరం పంట అవశేషాలను కాల్చవద్దని వాటిని నేలలో కలియదున్ని భూసారాన్ని పెంచుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పండే పంటలు, పంటల మార్పిడి కూరగాయల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. మార్కెట్లో రైతులకు న్యాయమైన ధర అందేలా మార్కెట్ కమిటీ అండగా ఉంటుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకొని అధికారుల సూచన మేరకు రైతులు పంటలను సాగు చేయాలని కోరారు. అనంతరం రైతులకు సబ్సిడీపై వచ్చిన పెసర విత్తనాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర లక్ష్మీరాజం, డిపిఓ మండల స్పెషల్ ఆఫీసర్, వీరభద్రయ్య,ఎంపీడీవో దొంతల రమేష్, తహసిల్దార్ మురళీకృష్ణ,టీజీ ఎన్పీడీసీఎల్ ఏఈఓ మధుకర్,వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

విభిన్న పంటల సాగు.. మెరుగైన ఆదాయం

బందనకల్ గ్రామంలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ముస్తాబాద్ నవంబర్ 17 (జనం సాక్షి)వరి సాగును వదిలి.. విభిన్నమైన పంటలు సాగు చేస్తూ మెరుగైన ఆదాయం పొందుతున్నారు. మూడెకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో నీటిని సద్వినియోగం చేసుకుంటూ ఐదు రకాల పంటలు సాగు చేస్తూ చేస్తున్నారు. ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామంలో చింతలకుల చంద్రం సాగు చేస్తున్న పంటలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయి పరిశీలించి అభినందించారు. ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతలకుల చంద్రం సాంప్రదాయంగా సాగు చేస్తున్న వరిని వదిలి కూరగాయలు పండిస్తున్నారు. ఫామ్ పౌండ్ ఏర్పాటు చేసుకుని దానికి డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు చేసి మూడు ఎకరాల విస్తీర్ణంలో దోసకాయ, కాకరకాయ, బీరకాయ, టమాట, పచ్చిమిర్చి, వేరు శెనగ సాగు చేస్తున్నారు. నీటిని సద్వినియోగం చేసుకుంటూ.. ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సాగు చేస్తూ నిరంతరం ఆదాయం వచ్చేలా ముందుకు సాగుతున్నారు. (ఎక్కడ విక్రయిస్తారు.)ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతలకుల చంద్రం ఆదర్శంగా కూరగాయల సాగు చేస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. సాగు విధానాన్ని తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో వేశారు? దిగుబడి ఎంత వస్తుంది? ఎక్కడ విక్రయిస్తారు? ఆదాయం ఎంత వస్తుందని రైతును ఆరా తీశారు. తనకు మూడు ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల సాగుతో ఏడాదికి రూ.3 నుంచి నాలుగు లక్షల ఆదాయం వస్తుందని, పంట ఉత్పత్తులు ముస్తాబాద్, సిరిసిల్లలో విక్రయిస్తామని జిల్లా కలెక్టర్ దృష్టికి రైతు తీసుకువెళ్ళారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్, మండల వ్యవసాయ అధికారి అనూష, గ్రామ సర్పంచ్ చిగురు నరేష్, దశరథ రావు, గ్రామాల వార్డు సభ్యులు రైతులు, తహసీల్దార్ ఫారూఖ్ , ఎంపీడీవో లచ్చులు, మారేడి వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి తను చదువుకున్న పాఠశాలకు హార్దిక సాయం



ముస్తాబాద్ నవంబర్ 17 (జనం సాక్షి)ముస్తాబాద్ మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , ప్రాథమిక పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి అయిన నాగెల్లి దేవానంద్ 1984 సంవత్సరంలో , సొంత గ్రామంలో చదువుకొని చిన్నప్ప నుండి కష్టపడి అంచలంచెలుగా ఎదుగుతూ వ్యాపారం రిత్య బొంబాయిలో స్థిరపడి తన సొంత గ్రామం కొండాపూర్ గ్రామానికి వచ్చి పాఠశాలను సందర్శించారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో స్టేజి నిర్మాణం కోసం 50 వేల రూపాయలు ఇస్తున్నట్టుగా ప్రకటించారు. ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడి టీవీ, డిజిటల్ క్లాసులు చెప్పడానికి వివిధ రకాల పరి కోరారు అందించడం జరుగుతుంది, నాగేల్లి దేవానందం గ్రామానికి చేసిన సేవ ఇంత అంతా కాదు వేలాది రూపాయలు గ్రామానికి సాయం చేశారు, కరువులో కూడా మంచినీళ్లు అందించారు, సాయిబాబా గుడికి ఆర్థిక సాయం అందించారు, ఎవరికి ఆపద వచ్చిన నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించారు, కష్టమైనప్రారంభమెప్పుడూ సుఖమైన ముగింపునే ఇస్తుందనడానికి మీ జీవితమొక నిదర్శనం. ధనం ఉన్నవాళ్లు చాలామంది ఉండవచ్చు. దానగుణం ఉన్నవాళ్లు మీలా తక్కువ మంది ఉంటారు పుట్టి పెరిగిన కొండాపురం పట్ల మమకారంతో ఎవరికి ఏ అవసరం వచ్చినా పెద్దదిక్కుగా నేనున్నానంటూ సత్వరమే స్పందించి చేస్తున్న మీ సహాయం అమూల్యమైనది. అడగక ముందే అందించాలనుకునే మీ గుణం అద్వితీయమైనది. ఇలా ఎన్నోసార్లు ఆర్థికంగా హార్థికంగా సహృదయతతో స్పందిస్తూ. చేయూత నందిస్తున్న ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, దేవేందర్ చారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ రాజేంద్ర రావు, లావణ్య పురుషోత్తం, శాలువాతో గౌరవించుకున్నందుకు సంతోషిస్తూ పాఠశాల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెండ్యాల మైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవి రెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ క్యారం రాజు, సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం ఆగదు

కరీంనగర్ టౌన్, నవంబర్ 17 (జనం సాక్షి)ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పాటించి ధర్మదీక్ష చేపట్టారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు సామూహిక సెలవు ప్రకటించి సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఇదే తరహాలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ పాత పెన్షన్ పునరుద్ధరణ ఉద్యమం ప్రధాన కార్యదర్శి గంగాపురం స్థితప్రజ్ఞ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతకు సంబంధించి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీవితకాలం ప్రజలకు సేవలందించిన ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత గౌరవప్రదమైన, భద్రతతో కూడిన పెన్షన్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.పెన్షన్ అనేది ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే కానుక కాదని, ఎన్నో సంవత్సరాల పాటు అందించిన సేవలకు ప్రతిఫలంగా లభించాల్సిన సామాజిక భద్రత అని నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టే నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ఉద్యమం ఏ ఒక్క వ్యక్తికి లేదా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని, ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, భవిష్యత్తు భద్రత కోసం ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన పోరాటమని నాయకులు తెలిపారు. పాత పెన్షన్ విధానం సాధించే వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా ఐక్యంగా, శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు షేక్ నిసార్ అహ్మద్, గౌరవ అధ్యక్షుడు గోనె శివరాం, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభిమానం పిలిచింది.. ఆప్యాయతతో ఆహ్వానించారు

చిన్నారి శాన్విక కోసం ఆతిథ్యం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు



మంథని, నవంబర్ 17, (జనంసాక్షి) : రాజకీయాల్లో నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడిగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్... ఓ చిన్నారి చూపిన అభిమానానికి అంతే ఆప్యాయతతో స్పందించారు. వయసుతో సంబంధం లేకుండా మనసులో చోటు సంపాదించుకున్న అభిమానం ముందు హోదాలు, అంతస్తులు అడ్డుకావని చాటిచెప్పారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన సింగం శ్రీనివాస్--లావణ్య దంపతుల కుమార్తె శాన్విక కి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అంటే ఎంతో అభిమానం. ఎప్పుడూ 'పుట్ట మధన్న.. పుట్ట మధన్న' అంటూ కలవరిస్తూ తన అభిమానాన్ని చాటుకునేది. ఆ చిన్నారి అమాయకపు అభిమానం, మధూకర్ పై చూపుతున్న ప్రేమను స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ చిన్నారి అభిమానానికి మురిసిపోయిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు.. శాన్విక తో పాటు ఆమె కుటుంబ సభ్యులను మంగళవారం మంథనిలోని తమ నివాసం రాజగృహాకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. చిన్నారిని, ఆమె కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి ఇంటికి వచ్చిన అతిథులుగా కాకుండా ఆత్మీయులుగా ఆదరించారు. కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేయడమే కాకుండా పుట్ట మధూకర్ శైలజ దంపతులు స్వయంగా వడ్డించి ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం చిన్నారి శాన్విక తో పాటు ఆమె తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. చిన్నారి చూపిన స్వచ్ఛమైన అభిమానానికి ఆప్యాయతతో బదులిచ్చిన పుట్ట మధూకర్ శైలజ దంపతుల తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వయసుతో నిమిత్తం లేకుండా మనసులను గెలుచుకునేదే నిజమైన అభిమానం.. ఆ అభిమానాన్ని గౌరవించడమే నిజమైన ఆత్మీయత అనే భావనను ఈ ఘటన చాటిచెప్పింది.

రైతుల ఆర్థిక అభివృద్ధికి దీర్ఘకాలిక రుణాలు దోహదం

మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని, నవంబర్ 17 (జనం సాక్షి) : రైతుల ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ అవసరాల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిమిత, మంథని ఆధ్వర్యంలో మంథని మండలం మంథని, బిట్టుపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు రైతులకు దీర్ఘకాలిక రుణాల చెక్కులను సంఘ కార్యాలయంలో సింగిల్ విండో అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య అందజేశారు. ఈ సందర్భంగా మంథని గ్రామానికి చెందిన చందుపట్ల శ్రీనివాస్ రెడ్డికి రూ.5 లక్షలు, ఆకుల వంశీ కుమారికి రూ.6 లక్షలు, బిట్టుపల్లి గ్రామానికి చెందిన మాటేటి కుమారస్వామికి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.17 లక్షల విలువైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు కల్పిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు సహకార సంఘం అందిస్తున్న రుణ సదుపాయాలను వినియోగించుకొని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

పశువుల నీటి తొట్టి నిర్మాణానికి ముగ్గు పోసిన నవాబ్ పేట సర్పంచ్



రామగిరి, నవంబర్ 17 (జనంసాక్షి) : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నవాబుపేట సర్పంచ్ రొడ్డ మౌనిక సతీష్ కుమార్ భూమిపూజ చేశారు. ఎల్ నినో ప్రభావం కారణంగా పెరుగుతున్న ఎండల తీవ్రత, నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా పశువుల నీటి తొట్టి నిర్మాణ పనులను చేపట్టారు. ఈ నిర్మాణ పనులకు మండల అభివృద్ధి అధికారి శైలజ, గ్రామ సర్పంచ్ రొడ్డ మౌనిక సతీష్ కుమార్ స్థల పరిశీలన చేసి, ముగ్గు వేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున, పశువులు, ఇతర మూగజీవాలు తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నీటి తొట్టిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి గ్రామస్తులకు, పాడి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా ఈ నీటి తొట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, నీరు వృథా కాకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మేకల శ్రవణ్ కుమార్, ఉప సర్పంచ్ అయిందల లావణ్య రాజ్ కుమార్, వార్డు సభ్యులు తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రుద్రంగి నవంబర్ 17 (జనం సాక్షి)రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో సొసైటీ ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ ఏగోళం శ్రీనివాస్,మార్కెట్ చైర్మన్ చెలుకల తిరుపతి,ఆత్మ కమిటి చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి,గ్రామ సర్పంచ్ గండి నారాయణ,ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు.రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి,సకాలంలో ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టమని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపతి ప్రభుత్వం అని అందుకే రైతు రుణమాఫీ,రైతు భరోసా, రైతు భీమా అందిస్తుందని అన్నారు.మూడు సంవత్సరలుగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని అన్నారు.ఎల్ నీనో ప్రభావన్నీ దృష్టిలో పెట్టుకొని రైతులు అరుతడి పంటలు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్ రెడ్డి,మాజీ జడ్పిటిసి గట్ల మీనయ్య,పొద్దుపొడుపు లింగారెడ్డి, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, ప్యాక్స్ డైరెక్టర్లు,ధర్నా మల్లేశం,మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య.ఎస్సిసెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



సిరికొండ,నవంబర్ 17(జనం సాక్షి):సిరికొండ మండలంలోని సత్య శోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 70వ జాతీయ సాఫ్ట్ బాల్ స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు నర్మల. స్నిథిక రెడ్డి, గాదరి అద్వైత్ రెడ్డి అండర్-19 జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రావుట్ల నర్సయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.నేటి నుంచి 20 వరకు చండీఘర్ లో నిర్వహించే క్రీడల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేసి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, అనీకేత్, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు అండగా మంత్రి శ్రీధర్ బాబు



మంథని, నవంబర్ 17, (జనం సాక్షి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఉదారి సంధ్యారాణికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమాచార సాంకేతికత, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఉదారి సంధ్యారాణికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 3 లక్షల ఎల్ ఓ సి మంజూరైంది. నిజాం వైద్య విజ్ఞాన సంస్థ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న సంధ్యారాణికి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం కోరగా, వెంటనే మంత్రి స్పందించి ఎల్ ఓ సి మంజూరు చేయించారు. హైదరాబాద్ లోని మంత్రి విడిది కార్యాలయంలో మంత్రి ఆసుపత్రి సహాయకులు ఎల్ ఓ సి అంద జేశారు. చికిత్స కోసం ఎల్ ఓసి మంజూరు చేసి అండగా నిలిచిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మనోవికాస కేంద్రంలో బాలల దినోత్సవం



సిరికొండ నవంబర్ 17(జనం సాక్షి): మండల కేంద్రంలోని మనోవికాస కేంద్రంలో బాలల దినోత్సవం సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం ఆటల పోటీలు గెలుపొందిన పిల్లలకు బహుమతులను అందజేశారు 2025- 26 సంవత్సరంలో పదవ తరగతి ఏ గ్రేడ్ పాస్ అయినందున తల్లిదండ్రుల సమక్షంలో పెద్ద వాల్గోట్ గ్రామానికి చెందిన బాబుకు సన్మానం చేసిన అధికారులు ఎంపీడీవో రఫిక్ అహ్మద్ మాట్లాడుతూ..... వైకల్యం అనేది శరీరానికే తప్ప ప్రతిభకు కాదు దివ్యాంగులైన పిల్లలు తలుచుకుంటే ప్రతి దాంట్లో విజయం సాధిస్తారని అన్నారు. వివిధ ఇరవై రకాల దివ్యాంగులకు సర్టిఫికెట్లు ఉంటే కచ్చితంగా వారికి పెన్షన్లు వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు.ఏపీఎం సువర్ణ మాట్లాడుతూ.... మండలంలోని ప్రతి గ్రామ సంఘం మీటింగ్ సమావేశాల్లో 21 రకాల వికలాంగులకు ప్రొఫెషనల్ ద్వారా అందిస్తున్నటువంటి సేవల సెంటర్ కు రావడం వల్ల ప్రతి నెల రెండుసార్లు స్పీచ్ తెరపి, పిజియోథెరపీ, అందించడం జరుగుతుందన్నారు. మహిళ సంఘం అధ్యక్షురాలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు వేలంపాట

గోదావరిఖని, జనంసాక్షి :పెద్దపల్లి జిల్లా మద్య నిషేధ.. అబ్కారీ అధికారి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ రామగుండం పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడిన మూడు వాహనాలకు ఈ నెల19న (గురువారం) ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్ .సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు ఉదయం 9 గంటలకు రామగుండం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లో సంప్రదించాలని ఆమె కోరారు. 50 శాతం ఈఎండి చెల్లించి వేలం పాట లో పాల్గొనాల్సి ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్.సరిత తెలిపారు.

లక్ష్మక్కపల్లిలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సర్పంచుల పోరం అధ్యక్షుడు గేల్లు శ్రీనివాస్ యాదవ్



వీణవంక సవంబర్ 17(జనం సాక్షి)వీణవంక మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో డిఆర్డిఏ,ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచుల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మంగళవారం రోజున ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వం ప్రకటించిన సన్న వడ్లకు ప్రతి క్వింటాళ్లకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ఇస్తుందని వారన్నారు. రైతులు దళారులను నమ్మొద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే తమ పంటలను అమ్మాలని సూచించారు.రైతులకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర ూా గ్రేడ్ 2461.జ. గ్రేడ్ 2441 రూపాయలను పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ దాసరపు శ్రీనివాస్,వివో అధ్యక్షులు దాసరపు రోజా,కార్యదర్శి మేకల సమత,కోశాధికారి కల్వల స్వప్న,సిసి ఆనంద్,వివోఏ రజిత,గ్రామా రైతులు,హమాలి సంగం నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నాయకురాలు సంధ్యారాణి హౌస్ అరెస్ట్



గోదావరిఖని, జనంసాక్షి ;హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో భారతదేశంపై, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలపై విదేశీ ప్రతినిధులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, సంబంధిత విదేశీ ప్రతినిధులు, సమ్మిట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 11:30 గంటలకు రామగుండం పోలీస్ కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేయడానికి వెళ్తున్న బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిని రామగుండం ఎస్ఐ జీ. హరిశేఖర్ హౌస్ అరెస్ట్ చేశారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపి, వినతిపత్రం అందజేయడానికి వెళ్తున్న నాయకురాలిని ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడం పౌరుల ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు విధించడమేనని బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఇటువంటి చర్యలపై అధికారులు తగిన వివరణ ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

ముస్తాబాద్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల కార్యక్రమం నిర్వహణ

పాథమిక పాఠశాలలో తనిఖీ
జిల్లా కలెక్టర్ గారిమ అగ్రవాల్



ముస్తాబాద్ నవంబర్ 17 (జనం సాక్షి)అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడతారని, వారిని ప్రతి రోజూ కేంద్రాలకు పంపించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.ముస్తాబాద్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువును పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. సామ్, మామ్ పిల్లలపై ఆరా తీశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, పరిశీలించారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులను ఆవిష్కరించారు. (ప్రాథమిక పాఠశాలలో తనిఖీ)అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన యూనిఫాంలు వేసుకున్న విద్యార్థులతో మాట్లాడారు. గణితం, ఇతర అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. జిల్లాలో ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు సమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. త్వరలో ఎనిమియా ముక్త్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. సర్పంచులు అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలించాలని, సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. (తల్లులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి)రక్త హీనతతో ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలల ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. (వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రం)ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడ లేని పిల్లలు, రక్తహీనత పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. అలాగే కరీంనగర్ లో ఎన్ ఆర్ సీ కేంద్రంలో సేవలు అందిస్తారని, ఉన్నత వైద్య సేవలు హైదరాబాద్ లో అందిస్తారని వెల్లడించారు.కార్యక్రమంలో జిల్లా ఆత్మ చైర్మన్ కొండం రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజి రెడ్డి, సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పార్టీల ప్రజా ప్రతినిధులు అంగన్వాడి సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో నవంబర్ 29 ఓ చారిత్రక మైలురాయి

- **కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే రాష్ట్ర సాధన ఉద్యమానికి కీలక మలుపు**
- **అలుగునూరులో దీక్షా దివస్ భారీ బహిరంగ సభ.. ముఖ్య అతిథిగా కేటీఆర్**



కరీంనగర్ టౌన్, నవంబర్ 17, (జనం సాక్షి)తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో నవంబర్ 29వ తేదీకి ప్రత్యేకమైన స్థానం ఉందని, తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అనే నినాదంతో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రాష్ట్ర ఏర్పాటు దిశగా కీలక మలుపుగా నిలిచిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు కేసీఆర్ చేపట్టిన దీక్ష చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ నెల 29న దీక్షా దివస్‌ను పురస్కరించుకుని కేసీఆర్‌ను పోలీసులు అరెస్టు చేసిన అలుగునూరులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. మంగళవారం కరీంనగర్ ఇందిరానగర్ చింతకుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో దీక్షా దివస్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

ఉద్యమాన్ని మలుపుతిప్పిన కేసీఆర్ దీక్ష

2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమని వినోద్ కుమార్ గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి కేసీఆర్ దీక్షకు దిగారని, కరీంనగర్ నుంచి బయలుదేరిన ఆయనను అలుగునూరు వద్ద పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం తరలించారని వివరించారు. ఈ అరెస్టుతో తెలంగాణవ్యాప్తంగా ఉద్యమం మరింత ఉధృతమైందని, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వాములయ్యాయని తెలిపారు. ఖమ్మంలో దీక్ష కొనసాగించిన కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించినప్పటికీ అక్కడ కూడా దీక్షను కొనసాగించారని పేర్కొన్నారు. ఒకవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఎగిసిపడిన ప్రజా ఉద్యమం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చిందన్నారు.కేసీఆర్ దీక్ష ఫలితంగా 2009 డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారని గుర్తుచేశారు. అయితే ఆంధ్ర ప్రాంత నాయకుల ఒత్తిడితో డిసెంబర్ 23న కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడంతో తెలంగాణలో మరోసారి ఉద్యమం తీవ్రరూపం దాల్చిందన్నారు. ఆ పరిణామాల నేపథ్యంలో ఎంతోమంది విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగాలు చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 9న ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే అనేకమంది ప్రాణాలను కాపాడి ఉండేవారన్నారు.

అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్ర సాధన

తెలంగాణ ఉద్యమం ఒక రాజకీయ పార్టీకి పరిమితమైన పోరాటం కాదని, కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు, మహిళలు, యువత భాగస్వాములయ్యారని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం వివిధ దశల్లో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రజల ఆకాంక్షను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఉద్యమమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు బాటలు వేసిందన్నారు.

అలుగునూరులోనే భారీ బహిరంగ సభ

కేసీఆర్ అరెస్టుకు సాక్షిగా నిలిచిన అలుగునూరులో దీక్షా దివస్ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఉద్యమ చరిత్రతో ముడిపడిన ఈ ప్రాంతంలో సభ నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలోని కీలక ఘట్టాలను మరోసారి గుర్తుచేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రవాణా, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సభ నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు అనుమతుల కోసం దరఖాస్తు చేయాలని సమావేశంలో చర్చించారు.

పలువురు ముఖ్య నాయకుల హాజరు

ఈ సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఒడితల సతీష్ కుమార్, రవిశంకర్, దాసరి మనోహర్ రెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు తుల ఉమ, దావ వసంత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి: తెలంగాణాలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్నఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఈ పథకం అమలు కోసం దరఖాస్తుల స్వీకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం గురించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ, అర్హత కలిగిన ప్రతి కుటుంబం వినియోగించుకునేలా సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 19వ తేదీ నుంచి గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు ముందస్తుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించబడుతుందని, కుటుంబంలో జీవనోపాధికి ప్రధానంగా ఆధారపడే వ్యక్తికి బీమా వర్తించేలా నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది ఆదాయం ఆర్జించే వారు ఉన్నట్లయితే, బీమా వర్తించే వ్యక్తిని ఆ కుటుంబమే ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. కులం, మతం, ఆదాయ పరిమితులతో సంబంధం లేకుండా కుటుంబాలకు జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యంగా దీనిని అమలులోకి తెస్తోందని తెలిపారు. కుటుంబ పెద్ద లేదా జీవనోపాధికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన వారు ఈ పథకం పరిధిలోకి వస్తారని, రేషన్ కార్డు ఉన్న కుటుంబాలతో పాటు, రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాలను కూడా ప్రభుత్వ సర్వే, అందుబాటులో ఉన్న కుటుంబ డేటా ఆధారంగా పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. బీమా ప్రయోజనం పొందే వ్యక్తి ఒకరిని లేదా ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసిన సందర్భంలో, బీమా మొత్తాన్ని తమకు నచ్చిన విధంగా పంపిణీ చేసే వివరాలను సైతం నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని అన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో నామినీలతో హాజరు కావాలని, నామినీ మైనర్ అయిన పక్షంలో అపాయింటీ రావాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు నమోదు సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీల వివరాలను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తులో నమోదు చేసిన వివరాలను కుటుంబ సభ్యులకు పూర్తిగా చదివి వినిపించి, వారు అర్థం చేసుకున్న తరువాతనే వారి సంతకం తీసుకోవాలని సూచించారు. తాము ఏ పథకం కోసం దరఖాస్తు చేస్తున్నారో, ఎవరిని నామినీలుగా ఎంపిక చేసుకున్నారో ప్రతి కుటుంబానికి స్పష్టంగా తెలియజేయాలని అన్నారు.దరఖాస్తుల స్వీకరణ గురించి ప్రజలకు ముందుగానే సమాచారం తెలియజేయాలని, అవసరమైన సిబ్బంది, కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఇతర సాంకేతిక వసతులను అందుబాటులో ఉంచాలని సూచించారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు వెంట తేవాలని, రేషన్ కార్డు లేని కుటుంబాల విషయంలో కూడా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కుటుంబ వివరాలను పరిశీలించి నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, భుజంగరావు, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, సీ.పీ.ఓ రతన్, ఇంచార్జి డీ.పీ.ఓ నాగరాజు,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముత్యాల సునీల్ కుమార్ కృషితో భీంగల్ కోర్టు అభివృద్ధికి రూ.18.45 లక్షలు మంజూరు

డీఎంఎఫ్ నిధులతో కోర్టు ఆవరణలో నాలుగు అభివృద్ధి పనులు



భీమ్గల్ నవంబర్ 16 జనం సాక్షి భీంగల్: బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కృషితో భీంగల్ మండల కేంద్రంలోని కోర్టు ఆవరణ అభివృద్ధికి జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్) నుంచి రూ.18.45 లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ తెలిపారు.ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి ఈ నెల 4న పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయం సమర్పించిన ప్రతిపాదనల మేరకు కోర్టు ఆవరణలో నాలుగు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఇందులో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం, షెడ్ ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం కల్పనకు రూ.5 లక్షలు, మరో షెడ్ నిర్మాణానికి రూ.5 లక్షలు, గ్రావెల్ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, ప్రీకాస్ట్ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.3.45 లక్షలు కేటాయించినట్లు తెలిపారు .మొత్తం రూ.18.45 లక్షలతో చేపట్టనున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయినట్లు చెప్పారు. పనుల పురోగతిని అధికారులు పర్యవేక్షించడంతో పాటు ఖర్చుల వివరాలు, పనుల ఫొటోలను డీఎంఎఫ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వివరించారు.భీంగల్ కోర్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు ఈ సందర్భంగా మల్లెల లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

భారత్ సమ్మిట్‌లో విదేశీ ప్రతినిధి జియాకోమో ఫిలిటెక్ వ్యాఖ్యలపై కరీంనగర్ బీజేపీ ఆగ్రహం

బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్ 2026'లో (విదేశీ రాజకీయ ప్రతినిధి) పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిటెక్ చేసిన రాజకీయ ప్రసంగంపై భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ తీవ్ర అభ్యంతరం చేస్తూ, విదేశీ ప్రతినిధిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా భారత్ సమ్మిట్ లో ఇటలీ విదేశీ ప్రతినిధి జియాకోమో ఫిలిటెక్ ప్రసంగిస్తూ బహిరంగంగా "ఓట్ చోర్, గద్దీ చోడ్" అనే రాజకీయ నినాదాన్ని లేవనెత్తి, దానిని ఇంగ్లీషులో "ఓటు దొంగ, నీ సీటును వదిలి వెళ్ళు" అని అనువదించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత భూభాగంలో జరిగిన కార్యక్రమంలో విదేశీ రాజకీయ సంస్థకు చెందిన సీనియర్ బాధ్యుడు భారత దేశ అంతర్గత రాజకీయ చర్చల్లో జోక్యం చేసుకోవడంపై సరికాదని, జియాకోమో ఫిలిటెక్ కాన్ఫరెన్స్ వీసా, బిజినెస్ వీసా, టూరిస్ట్ వీసానా లేదా ఏ ఇతర కేటగిరీ వీసాపై భారత్‌లోకి ప్రవేశించారనేది నిగ్గుతేల్చాలని కోరారు. సమ్మిట్‌లో ఆయన చేపట్టిన రాజకీయ కార్యకలాపాలు ఆ వీసా నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని తేలాలని డిమాండ్ చేశారు. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025' కింద వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘనపై విచారణ జరిపి, ఈ కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా ప్రేరేపి ంచిన, కుట్ర పన్నిన లేదా సహకరించిన సదస్సు నిర్వాహకులు, స్పాన్సర్లు, సమన్వయకర్తలు బాధ్యులపై తగిన చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిని కలిసిన వారిలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుజ్జ శ్రీనివాసరావు, మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, ఎర్రబెల్లి సంపత్ రావు, నరసింహ రాజు, కోల అశోక్ , పుప్పాల రఘు బిజెపి కిసాన్ మోర్చా , బీజేవైఎం, ఎస్టి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు మోతే గంగారెడ్డి, సంఘ నరేష్, రమావత్ శ్రీనివాస్ నాయక్, సమీ పర్వేజ్, సోషల్ మీడియా కన్వీనర్ వినోద్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి నిజరూప దర్శనానికి గవర్నర్‌కు ఆహ్వానం



మల్యాల నవంబర్ 16 (జనం సాక్షి) తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో 60 సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్న చందనోత్సవ మహా సంప్రోక్షణ కార్యక్రమానికి విచ్చేసి,శ్రీ స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవలసిందిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ను మంగళ వారం ఎమ్మెల్యే మరియు దేవాదాయ శాఖ అధికారులు అర్చకులు లోకభవన్లో కలిసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమ ంలో ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంత రావు,దేవాదాయ శాఖ,ధార్మిక అడ్వైజర్ గోవింద హరి,ఆలయ ఈవో ఎస్. అంజనా రెడ్డి,పర్యవేక్షకులు సునీల్ కుమార్, వేదపారాయణ దారులు మరియు అర్చకులు ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం నమోదుకు సిద్ధంగా ఉండండి

మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్



మంథని, నవంబర్ 17 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం నమోదు కార్యక్రమం సందర్భంగా మంథని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పథకం కింద 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయస్సు గల ప్రతి కుటుంబం నుండి కుటుంబ పెద్ద లేదా ఒక కుటుంబ సభ్యుడు నమోదు చేసుకోవడానికి అర్హులు అని తెలియజేశారు. రేషన్ కార్డు ఉన్నవారితో పాటు రేషన్ కార్డు లేని వారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. రేషన్ కార్డు లేని వారు ఆధార్ కార్డు ప్రతిని సమర్పించాలని సూచించారు. ఈ పథకంలో నమోదు చేసుకునేందుకు సంబంధించిన స్థలం, తేదీ, సమయ వివరాలను తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కావున అర్హులైన మంథని పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి, నమోదు కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

గన్నేరువరంలో రెండు తలలతో పుట్టిన గొర్రె పిల్ల మృతి



గన్నేరువరం, నవంబర్ 17 (జనంసాక్షి):గన్నేరువరం మండలం చాకలివాని పల్లి గ్రామంలోని కూనవాని పల్లికి చెందిన కూన మల్లయ్య గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం గొర్రెల మందలోని ఒక గొర్రె ఒక పిల్లకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన పిల్ల రెండు తలలతో ఉండటంతో అందరూ ఆశ్చర్యపోయారు. పుట్టిన పిల్ల మగది. పుట్టినప్పటి నుంచే పిల్ల చాలా నీరసంగా ఉంది. రైతు ఎంతో ప్రయత్నం చేసినా కొద్దిసేపటికే పిల్ల చనిపోయింది.రెండు తలలతో పుట్టిన గొర్రె పిల్లను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలివచ్చారు. పశువైద్యుల ప్రకారం కడుపులో పిండం పూర్తిగా విడిపోకపోవడం వల్ల ఇలాంటి అరుదైన జననాలు జరుగుతా యని, ఇలాంటి పిల్లలు బతకడం చాలా కష్టమని తెలిపారు. ప్రస్తుతం తల్లి గొర్రె ఆరోగ్యంగా ఉన్నట్లు సమాచారం.

లింబాద్రి గుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించుకున్న ఆర్మూర్ కోర్టు న్యాయమూర్తులు



భీంగల్ నవంబర్ 17 జనం సాక్షి :కార్తీకమాస బ్రహ్మోత్సవాల స్వామివారిని ఆర్మూర్ సినియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి భవ్య శ్రీ దర్శించుకున్నారు. వారికీ ఆలయ అర్చకులు స్వాగతం పలికి స్వామివారిని దర్శింప జేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింహా స్వామి దర్శించుకోవడం ఎంతో అదృష్టమని స్వామి గత సంవత్సరం కుడా వచ్చి దర్శించుకున్నామని అన్నారు.వారికి భీంగల్. యస్ ఐ. చిరంజీవి భద్రత కల్పించారు.

సహకారంతోనే సమాజ అభివృద్ధి సాధ్యం



కరీంనగర్ కల్చరల్, నవంబర్ 17,(జనం సాక్షి):అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ నగరంలోని కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి నవంబర్ 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ సందర్భంగా బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి మాట్లాడుతూ..చేయి చేయి కలిపినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఒకరిద్దరితో ప్రారంభమైన సహకార సంఘాలు నేడు వందలాది,వేలాది మంది సభ్యులతో విస్తరించి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.భారతదేశానికి సహకార సంఘాలు వెన్నెముక లాంటివని ,కుల సంఘాలు,మహిళా సంఘాలు,మహిళా సమాఖ్యలు, రైతు సంఘాలు,వివిధ రకాల సహకార బ్యాంకులు తదితర అనేక సంస్థలు సహకార స్ఫూర్తితో పనిచేస్తున్నాయని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో సహకార సంఘాలు 1964 సహకార చట్టం ప్రకారం కొనసాగుతున్నాయని, ఈ చట్టంలో మరికొన్ని మార్పులు తీసుకువ చ్చినట్లయితే సహకార సంఘాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా సహకార సంఘాల్లో ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గడ్డం విలాస్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు మడుపు మోహన్,ముక్క భాస్కర్, అలుగు విద్యాసాగర్,నాగుల సతీష్ ,మార్కరాజు,బ్యాంకు సీఈఓ శ్రీనివాస్,ఎలుక సుధాకర్‌తో పాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతకు చిత్రలేఖన పోటీలు దోహదం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి:59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు. 'మానవ జీవన విధానం -- నాడు, నేడు' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను, కళాత్మక ప్రతిభను చాటుకున్నారు.గతంలో మానవ జీవన విధానం, ప్రస్తుత ఆధునిక జీవనశైలి మధ్య ఉన్న మార్పులను తమ చిత్రాల ద్వారా విద్యార్థులు అద్భుతంగా ఆవిష్కరించారు. సామాజిక మార్పులు, సాంకేతిక అభివృద్ధి, పర్యావరణ పరిస్థితులు తదితర అంశాలను ప్రతిబింబిస్తూ రంగురంగుల చిత్రాలను రూపొందించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. రాజిరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ జి. శ్రావణ్ శ్రీకాంత్ నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ అభిలాష్, పద్మావతి, భాగ్యలక్ష్మి తదితర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ అనిల్ కుమార్‌కు శుభాకాంక్షలు

తెలిపిన కరీంనగర్ ఆర్ఎం



కరీంనగర్ టౌన్, నవంబర్ 17, (జనం సాక్షి)తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నూతన వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్ కుమార్‌ను కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి. రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.మంగళవారం హైద రాబాద్‌లోని ఆర్టీసీ బస్ భవన్‌లో ఉన్న ఎండీ కార్యాలయంలో డాక్టర్ అనిల్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే దిశగా నూతన నాయకత్వంలో సంస్థ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.

ధర్నాచౌక్‌లో దద్దరిల్లిన ధర్మ దీక్ష

సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల కదం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ ప్రాంగణంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల నినాదాలతో దద్దరిల్లింది. తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు మరియు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణే ధ్యేయంగా చేపట్టిన 'ధర్మదీక్ష' కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు చేపట్టిన మంగళవారం ఒకరోజు సామూహిక సెలవు, నిరసన దీక్షలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వ తీరుపై తమ నిరసన గళాన్ని స్పష్టంగా వినిపించారు.ఈ సందర్భంగా ధర్నా దీక్షను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు కత్తి విక్రమ్ సింగ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో హామీలను నమ్మి మూడేండ్లు ఎంతో ఓపికతో వేచి చూశామని, అయినప్పటికీ ప్రభుత్వం నుండి స్పష్టమైన స్పందన లేకపోవడంతోనే ఈ పోరాట బాట పట్టాల్సి వచ్చిందని తేల్చిచెప్పారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ విధానం వల్ల రిటైర్మెంట్ భద్రత కరువై, ఉద్యోగులు తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేయాలని, తమ హక్కు అయిన పాత పెన్షన్‌ను తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం పెన్షన్ సమస్య మాత్రమే కాకుండా, పదవీ విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న మరో అత్యంత కీలకమైన సమస్యను కూడా నాయకులు సభ దృష్టికి తీసుకువచ్చారు. హెల్త్ కార్డ్ ద్వారా ప్రస్తుతం,వైద్య,ఎవలు,అందుతున్నప్పటికీ,,సీపీఎస్,ఉద్యోగులు,రిటైర్,అయిన,తరా వాత వారికి పెన్షన్ ఐడీ ఉండక పోవడం వల్ల భవిష్యత్తులో హెల్త్ స్కీమ్ పూర్తిగా వర్తించకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో వైద్యం కూడా అందక పోతే ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ, ఈ ప్రాణాధార సమస్యకు ప్రభుత్వం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన వందలాది మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శించిన ఈ ఐక్యత ప్రభుత్వంలో కదలిక తెస్తుందనే నమ్మకాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.ఈ ధర్మదీక్ష కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి రాములు, రాష్ట్ర బాధ్యులు రవికిరణ్ లతో పాటు పలు సంఘాల ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు. వెంకటరమణ, గంగాప్రసాద్, అంబెల్ల శంకర్, పంచాయతీ సెక్రటరీ ఎంప్లాయీస్ అధ్యక్షులు సుమన్ తదితరులు పాల్గొని ఉద్యమానికి తమపూర్తి మద్దతు ప్రకటించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి

అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి) : చెస్ అనేది అనేక ప్రయోజనాలు అందించి మేధోసంపతిని పెంపొందించే మనోహరమైన క్రీడా అని ఈ క్రీడను క్రమం తప్పకుండా ఆడడం వల్ల కలిగే ప్రయోజనాలు అధికమని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థి జి.అభయ్ రామ్, 6వ తరగతి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించినటువంటి ప్రత్యేక అభినందన సభకు వారు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామాజిక సంబంధాలు మెరుగుపరచుకోవడంలో చెస్ క్రీడా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతిరోజు కొంత సమయం చెస్ ఆడడం వలన జ్ఞాపక శక్తి పెరుగుతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడకు చాలా క్రేజ్ ఉందని, పిల్లలు ఈ క్రీడ పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని వారు చెప్పారు. పాఠశాలలో సైతం అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులచే చెస్ క్రీడలో శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు సైతం ఎంపిక చేస్తూ అద్భుత ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా భగత్ నగర్ లోని మల్లమ్మ మార్కెట్ వద్ద చైతన్య క్లబ్లో గజ్వేల్ చెస్ అకాడమీ, విశ్వనాధ్ చెస్ అకాడమీ వారు సంయుక్తంగా నిర్వహించినటువంటి జిల్లా స్థాయి చెస్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి జి.అభయ్ రామ్,6వ తరగతి, అద్భుత ప్రదర్శన కనబరచి 9వ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా త్వరలో గజ్వేల్ లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు సైతం ఎంపికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని వారు చెప్పారు. విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ విజయాన్ని నమోదు చేసి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

ఓకే కుటుంబంలో ముగ్గురు వైద్యులు

పేదరికం చదువుకు అడ్డు కాదు..పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు



జమ్మికుంట, నవంబర్ 17 (జనం సాక్షి):జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన ఎస్ కే గౌస్ ఆర్థిక ఇబ్బందులు,పేదరికం చదువుకు ఏమాత్రం అడ్డుకాదని నిరూపించారు.హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న గౌస్ సాధారణ ఉద్యోగం చేస్తూ ఎన్నో ఆర్థిక పరిమితులను ఎదుర్కొంటూనే తన ముగ్గురు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు.ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడిని వైద్యులుగా తయారు చేసి తండ్రిగా తన బాధ్యతను గొప్పగా నిర్వర్తించారు.హోంగార్డు విధుల ద్వారా వచ్చే పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూ, పిల్లల చదువుకు ఎలాంటి లోటు రాకుండా గౌస్ కష్టపడ్డారు.పిల్లల ఉన్నత చదువుల కోసం ఎన్నో త్యాగాలు చేస్తూ, వారి భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగారు.తండ్రి కష్టం, త్యాగం,ప్రోత్సాహానికి పిల్లలు తమ ప్రతిభతో ప్రతిఫలం అందించారు.నేడు ఒకే కుటుంబం నుంచి ముగ్గురు వైద్యులుగా ఎదగడం విశేషం.సంపద ఉంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమనే భావనను పటాపంచలు చేస్తూ,పట్టుదల, కష్టపడే తత్వం,విద్యపై ఆసక్తి ఉంటే పేదరికాన్ని సైతం అధిగమించవచ్చని ఈ కుటుంబం నిరూపించింది.ఒక సాధారణ హోంగార్డు తన ముగ్గురు పిల్లలను వైద్యులుగా తీర్చిదిద్దడం సమాజానికి స్ఫూర్తిదాయకం. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు గౌస్ కుటుంబం ఆదర్శంగా నిలుస్తోంది.పిల్లల విజయమే తన జీవితానికి అసలైన సంపదగా భావించే ప్రతి తండ్రికి ఈ కథనం ఒక నిదర్శనం.పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె గౌస్ కు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె ఎస్.కె హజారా కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేసింది, రెండవ కుమార్తె ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మూడవ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తుంది. ఒకే ఒక కుమారుడైన నవాజ్ అలీ కూడా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

రామగిరి, నవంబర్ 17, (జనంసాక్షి)



- రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రంను మర్యాదపూర్వకంగా కలిసిన పెద్దపల్లి జిల్లా కార్యవర్గం
- పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపిన జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి

భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (బి.ఎన్.ఆర్.కె.ఎస్.) రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం తెలిపారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన దరిపల్లి చంద్రంను భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి, ఉపాధ్యక్షుడు తిరునహరి రాజు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆయన కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలోని భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా కార్మికులకు కలుగుతున్న ప్రయోజనాలపై రాష్ట్ర అధ్యక్షుడితో స్వామి చర్చించారు.అర్హులైన ప్రతి కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. దీనిపై స్పందించిన దరిపల్లి చంద్రం మాట్లాడుతూ. జిల్లా పర్యటనలో భాగంగా నవంబర్ 26న పెద్దపల్లికి విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటానని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి శంకర్, కార్యదర్శి కుమ్మం లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శి ఇటిక్యాల సుధాకర్, కార్యవర్గ సభ్యులు మల్యాల రాజయ్య, రాచర్ల చంద్రమౌళి, గడ్డం శంకర్, మామిడి కుమార్, మోత్కూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 584 నూతన చేయూత పింఛన్లు



మల్యాల నవంబర్ 17 (జనంసాక్షి)

మల్యాల మండల వ్యాప్తంగా 584 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరైనట్లు మంగళవారం ఎంపీడీవో స్వాతి తెలిపారు. దివ్యాంగులు 110, వివాహమైన ఒంటరి మహిళలు 49,వివాహం కాని ఒంటరి మహిళలు 14,గీత కార్మికులు 120, వితంతువులు 291 మంది ఉన్నారు.వీరికి మంజూరు పత్రాలను త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు.

టాక్లి గ్రామంలో న్యాయ సహాయ కేంద్రం ఏర్పాటు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనంసాక్షి:

టాక్లి గ్రామంలో మంగళవారం న్యాయ సహాయ కేంద్రం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మరియు టాక్లీ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ యొక్క న్యాయ సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన గ్రామ ప్రజల యొక్క సమస్యలు రాజీ పడదగిన సమస్యలు వారికి మధ్యవర్తిత్వం ద్వారా కుటుంబ తగాదాలు భూ సమస్యలు మొదలైన అంశాలపై రాజీమార్గమే రాజమార్గము అను నినాదం ద్వారా ప్రతి ఇంటి సమస్యను పరిష్కరించి అందరూ సంతోషంగా ఉండే విధంగా చూడడం కోసమే ఈ న్యాయ సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి శుభం అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్ ప్రమోద్ అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పద్మావతి టాక్లీ గ్రామ సర్పంచ్ రాము పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో చైతన్యకు ద్వితీయ స్థానం

గంభీరావుపేట నవంబర్ 17 జనంసాక్షి



ఎలక్షన్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో గంభీరావుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్. చైతన్య ద్వితీయ స్థానం సాధించాడు. నియోజకవర్గ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచిన చైతన్య జిల్లా స్థాయిలో సత్తా చాటాడు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు. ఈ విజయానికి కృషి చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అగ్నిప్రమాద బాధితులను కలిసిన ఎమ్మెల్యే

ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు బట్టలు అందిస్తానని హామీ



జనం సాక్షి నవంబర్ 17 గాంధారి:

గాంధారి మండలంలోని చద్మల్ తాండ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు రెండు మూడు కుటుంబాలు ఆర్థికంగా నష్టపోగా మంగళ వారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ పరామర్శించి ధైర్యం చెప్పాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మన మాట్లాడుతూ ఇలా జరగడం చాలా దురదృష్టకరమని తప్పకుండా నష్టపోయిన బాధిత కుటుంబాలకు తప్పని సరిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంతో పాటు కట్టిస్తానని హామీ ఇస్తూ అభయ హస్త పత్రాన్ని అందజేయడం జరిగింది. అంతేకాకుండా పూర్తిగా అగ్నికి ఆహుతి అయిన నిత్యవసర సరుకులకు గాను ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. తప్పకుండా అగ్నిమాపక ప్రమాదంలో సర్వం కోల్పోయిన వీరికి ప్రభుత్వం ఆదుకునే విధంగా చూస్తామని వీరికి కావలసిన దుస్తులను, బట్టలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన

కమాన్ పూర్ , నవంబర్ 17 (జనంసాక్షి) :

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎల్ నినో ప్రభావం వలన రైతులు యాసంగిలో వరికి బదులు గా సాగు చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటలపై, ఆరుతడి పంటలపై మంగళవారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పేరపల్లి, రొంపికుంట గ్రా మాలలో అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి రామకృష్ణ, రొంపికుంట గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్, పేరపల్లి గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షులు తిరుపతి, రొంపికుంట గ్రామ ఉప సర్పంచ్, సహకార సంఘం సంచాలకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సంచాలకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



వీణవంక లో చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు

అందజేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

వీణవంక నవంబర్ 17(జనం సాక్షి)

వీణవంక చేయూత పెన్షన్ మంజూరి పత్రాలు లబ్ధిదారులకు అందజేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి,ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను లబ్ధిదారులకు అందించాలని ఆయన సూచించారు. వీణవంక మండలంలోని మంగళవారం రోజున 26 గ్రామ పంచాయతీలకు సంబంధించిన 561 పింఛన్లను వీణవంక మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ..మండలంలోని ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి చేయూత భరోసా పింఛన్ అందేలా చూడాలని అన్నారు.ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి పేదలు,వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు తోపాటు అర్హులైన వారికి పింఛన్లు వారి కుటుంబానికి ఎంతో భరోసాగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సల్మాన్ రాజ్,ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయితీ కార్యదర్శులు,లబ్ధిదారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సోనియా గాంధీ పై విమర్శలు తగదు : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాళీద్

మెట్‌పల్లి: నవంబర్ 17, జనంసాక్షి :



సోనియా గాంధీ పుస్తక ఆవిష్కరణ నేపథ్యంలో కొందరు ఇతర పార్టీల నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తు, విమర్శలు చేస్తున్నారని ఆరోపిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి దిష్టిబొమ్మను మెట్‌పల్లి పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ముందు కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఖాళీద్ మాట్లాడుతూ... సోనియా గాంధీ ఆవిష్కరించిన 'బిలాంగింగ్ – ఏ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకాన్ని పూర్తిగా చదువకుండానే కొందరు ఇతర పార్టీల నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంగిత జ్ఞానంతో పుస్తకాన్ని పూర్తిగా చదివి మాట్లాడాలని సూచించారు. సోనియా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి దిష్టిబొమ్మను తగలబెట్టామని అన్నారు. నిజ నిజాలు తెలుసుకోకుండా సోనియా గాంధీపై అసత్య ఆరోపణలు చేస్తే పరిస్థితిని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎర్రోళ్ల హనుమాన్లు, సీనియర్ అడ్వకేట్ సురభి అశోక్, కాంగ్రెస్ మాజీ టౌన్ ప్రెసిడెంట్ జట్టిలింగం, ఎండి షాకీర్, సంగు గంగాధర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణయ్, దళిత సంఘం నాయకులు దాసరి బాబు, ప్రెషర్ జిల్లా చైర్మన్ పల్లికొండ ప్రవీణ్, ఎడిమల లక్ష్మారెడ్డి చైర్మన్ కొమ్ముల సంతోష్ రెడ్డి,నదీమ్,కృష్ణమూర్తి, అడ్వకేట్స్ ఎలుమూల రాంబాబు,పొట్ట రాజేశ్వర్, పుప్పాల దేవేందర్, మారుతీ, సన్నీ, ఫకీర్ కొండాపూర్ సర్పంచ్ అశోక్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు

ఇఫ్కో సహకార సంస్థ ఆధ్వర్యంలో..



ఆర్మూర్,నవంబర్ 17(జనంసాక్షి):
ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక దిగుబడితో పాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఇఫ్కో సహకార సంస్థ డైరెక్టర్ మార గంగారెడ్డి అన్నారు. ఇఫ్కో సహకార సంస్థ ఆధ్వర్యంలో ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ శివారులో వ్యవసాయ క్షేత్రంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు.రైతులు ఆయిల్ ఫామ్ సాగు యొక్క సమస్యలు పరిష్కారాలను ఈ వేదిక ద్వారా నివృత్తి చేసుకున్నారని మార గంగారెడ్డి చెప్పారు.ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి భాస్కర్ రెడ్డితో పాటు పలువురు అధికారులు రైతులకు ఆయిల్ పామ్ సాగు విధానం,మొక్కల నాటడం,పంట యాజమాన్య పద్ధతులు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భవిష్యత్తులో వచ్చే దిగుబడి తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు.ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని, సరైన పద్ధతుల్లో సాగు చేపడితే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని అధికారులు తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ఇఫ్కో మేనేజర్ శివరామకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రణికుమార్,హార్టికల్చర్ అధికారులు సంధ్యారాణి, ఆయిల్ పామ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ ఎంసీ గంగారెడ్డితో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

దర్గా,జామా మసీద్ అభివృద్ధికి
30 లక్షల నిధులు మంజూరు..



గాంధారి నవంబర్ 17 జనంసాక్షి :
గాంధారి మండలంలోని దర్గా జమా మసీద్ అభివృద్ధికి దాదాపు 30 లక్షల రూపాయలు కేటాయించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ కు ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని దర్గా వద్దగల ప్రహరీ గోడ నిర్మాణానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మొత్తం ఎదురుగా 30 లక్షలతో పనులు చేపట్టాలని దీనికి గాను 30 లక్షల వరకు ఖర్చు అవుతుందని దీనికోసం నిధులు సమకూర్చాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ద్వారా కలెక్టర్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం సోదరులు అధికారుల సంఖ్యలో పాల్గొన్నారు.



యువ సంకల్పంతోనే సమాజ వికాసం సాధ్యం
టూటా అధ్యక్షులు డాక్టర్ ఎ. పున్నయ్య

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనంసాక్షి:
యువతలో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం పెంపొందినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షులు డాక్టర్ ఎ. పున్నయ్య అన్నారు.అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్?1 ఆధ్వర్యంలో “యువ సంకల్పం ? సమాజ వికాసం” అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎ. పున్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా సామాజిక సమస్యలపై అవగాహన పెంపొందించుకొని వాటి పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన యూజీసీ వ్యవహారాల డీన్ డాక్టర్ పాత నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావం, సామాజిక స్పృహ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్?1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల ఆలోచనలు, ఆకాంక్షలు, హక్కులు, బాధ్యతలకు వేదిక కల్పించడంతోపాటు వారిలో నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత సమాజంలో సానుకూల మార్పుకు చోదకశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విద్యార్థిని సౌందర్య ఆలపించిన గీతం ఆకట్టుకుంది. అనంతరం అనిల్ కుమార్, స్వాతి, మనోహర్, నీరజ తదితర విద్యార్థులు ప్రసంగిస్తూ విద్యార్థుల హక్కులు, బాధ్యతలు, యువత పాత్ర, సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. దత్తహరి, డాక్టర్ బి. రామలింగం, డాక్టర్ ఎం.నర్సయ్య, డాక్టర్ బి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లాకు ప్రత్యేక ఫండ్ కేటాయిస్తే మరింత అభివృద్ధి చేస్తా
8వ డివిజన్ లో నిర్మించే రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి:
ఇందూరు: రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 8వ డివిజన్ లో గల సీతారాంనగర్ కాలనీ బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మించే రోడ్డు పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ లో కేటాయించిన 20 లక్షల నిధులతో ప్రతి డివిజన్లో పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. అలాగే కొన్ని డివిజన్లో కోటి రూపాయల పనులు కూడా ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా స్పెషల్ ఫండ్ కేటాయించలేదని చెప్పారు. మూడేళ్ళయినా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నగరంలో కొన్ని డివిజన్ లలో నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేటర్ మఠం పవన్, కాలనీ పెద్దలు కిషన్, శ్రీనివాస్, విశ్వ సాయి, శివశంకర్, లింగాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోమాతను పూజించే భూమి పావనం
గోపాష్టమి వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనంసాక్షి:
ఇందూరు: సనాతన ధర్మంలో గోమాతను, స్త్రీని పూజించే భూమి పావనమవుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. గోశాల కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని గోపాల్ బాగ్ లో గోపాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ ధర్మంలో గోమాతకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గోమాతను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించిన పుణ్యం వస్తుందన్నారు.ఇందూరు గోశాలకు దక్షిణ భారతదేశంలోనే పేరు ప్రతిష్టలు ఉన్నాయన్నారు. ఈ గోశాలకు సుమారు వందేళ్ల చరిత్ర ఉందన్నారు. భవిష్యత్తులో గోశాలకు ఎటువంటి అవసరం ఉన్నా..తాను ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోశాల కమిటీ అధ్యక్షులు పవన్ కేడియా, ట్రస్ట్ అధ్యక్షులు కైలాష్ గోయెంకా, కార్యదర్శులు మాస్టర్ శంకర్, కమల్ ఇనాని, కోశాధికారి ధన్పాల్ శ్రీనివాస్, సీనియర్ ట్రస్ట్ మెంబర్ ప్రదీప్ జై భీమానీ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోటూరి దయానంద్ గుప్త, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజు, రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ధన్ పాల్ దత్తు బిజెపి సీనియర్ నాయకులు ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో గురుకుల విద్యార్థినిలు

మల్యాల నవంబర్ 17 (జనం సాక్షి)



మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినిలు జి.యశస్వినీ, యం.మేఘన కోరుట్లలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 17 బాలికల కబడ్డీ పోటీల్లో రాణించి నవంబర్ 18 న సిరిసిల్ల జిల్లాలోని గాలిపల్లిలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల అండర్ 17 బాలిక కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పి.ఇ.టి మధులికలు తెలిపారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎస్ఆర్ విద్యార్థిని భవ్యశ్రీ ఎంపిక
అభినందించిన కళాశాలల డీజీఎం గోనె గోవర్ధన్‌రెడ్డి



నిజామాబాద్, నవంబర్ 17 (జనం సాక్షి):
సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఇటీవల నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నిజామాబాద్ గంగస్థాన్ ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థిని భవ్యశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 18 నుంచి 22 వరకు పంజాబ్‌లోని చండీగఢ్‌లో జరగనున్నాయి. భవ్యశ్రీ జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఎస్ఆర్ కళాశాలల డీజీఎం గోనె గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు కూడా కళాశాలలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు నీట్, ఎంబీబీఎస్, ఎన్ఐటీ, ఐఐటీ, జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లలో ప్రతిభ కనబరచడంతో పాటు క్రీడల్లోనూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం సంతోషకరమన్నారు.కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, డీన్ రాంబాబు, ప్రిన్సిపాల్ హనుమంత రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని భవ్యశ్రీని అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జనంసాక్షి



రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా సుల్తానాబాద్ మండల బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

సుల్తానాబాద్,నవంబర్ 17(జనంసాక్షి) :

భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా,దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం, జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించగా,ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే ఉద్దేశంతో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, పలువురు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ ముందస్తు అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ గౌరవం,సమగ్రతకు భంగం కలిగించే వ్యాఖ్యలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు,వేగోళం శ్రీనివాస్ గౌడ్,కొల్లూరి సంతోష్ కుమార్ చిట్టవేణి సదయ్య, ఓజ్జా సతీష్,మారం రమేష్,ఈర్ల ప్రశాంత్,మ్యాదరవేణి రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

కేలో ఇండియా కోకో సెంటర్‌ను పరిశీలించిన బెంగళూరు ప్రతినిధి



సుల్తానాబాద్,నవంబర్ 17(జనంసాక్షి) :

సుల్తానాబాద్‌లోని కేలో ఇండియా కోకో సెంటర్‌ను పరిశీలించేందుకు బెంగళూరు నుంచి భువనచంద్ర ఇన్‌స్పెక్షన్ నిమిత్తం విచ్చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా కేలో ఇండియా కోకో కోచ్, ఇంటర్నేషనల్ ప్లేయర్ గెల్లు మధుకర్ యాదవ్,సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యా ల రవీందర్, పెద్దపల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ జనరల్ సెక్రటరీ ఆలేటి సంపత్ కుమార్, పీఈటీ అజ్జు,దొడ్ల దేవేందర్ పటేల్,తదితరులు పాల్గొన్నారు.

సాదర్ యాదవ కమిటీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బాకం సాయి కిరణ్ యాదవ్ కు ఘన సన్మానం



సుల్తానాబాద్,నవంబర్ 17(జనంసాక్షి) :

సుల్తానాబాద్ మండల సాదర్ యాదవ కమిటీ మండలం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన, 6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ యాదవ్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆరపెల్లి సుహాన్ రాజ్, మామిడి పల్లిశ్రీకాంత్, గోదల సునీల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆరపెల్లి హేమన్ రాజ్, ఆరపెల్లి కిరణ్ సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న,సాయి కిరణ్ యాదవ్‌ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని,తన నాయకత్వంతో సమాజానికి మరింత సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

బాకం సాయికి మరో పదవి

సాదర్ ఉత్సవ కమిటీ మండల అధ్యక్షునిగా ఏకగ్రీవ ఎన్నిక

- సాధర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం
- నూతన మండల అధ్యక్షులు సాయికిరణ్ యాదవ్



సుల్తానాబాద్,నవంబర్ 17(జనంసాక్షి) :

సాధర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, నూతన మండల అధ్యక్షునిగా ఎన్నికైన, సామాజిక సేవకులు, ఆరవ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆరవ వార్డు కౌన్సిలర్ భాగం సాయికిరణ్ యాదవ్, కు మరో పదవి వరించింది. సుల్తానాబాద్ మండల సాదర్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గ ఎంపికలో, 6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ యాదవ్ ను మండల అధ్యక్షుడిగా కమిటీ సభ్యులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

-మండల అధ్యక్షు లు గా,బాకం సాయి కిరణ్ యాదవ్, ఉపాధ్యక్షుడుగా,ఓజ్జ సతీష్ యాదవ్ క్యాషియర్ గా, మాజీ కౌన్సిలర్, కూ కట్ల గోపి యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా యాదవ సంఘం పెద్దలు,సభ్యులు నూతన కార్యవర్గంపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు క్యాషియర్లకు, పలువురు శు భాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో సాదర్ ఉత్సవ కమిటీ ఐక్యతతో, సంప్రదాయాలను కాపాడుతూ మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా నూతనంగా,సాధర్ సుల్తానాబాద్ మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్, మాట్లాడుతూ తనపై నమ్మకంతో కుల పెద్దలంతా ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించి, ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సాదర్ ఉత్సవాలను నూతన కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఘనంగా సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా నిర్వహిస్తామని భాకం సాయికిరణ్ యాదవ్ స్పష్టం చేశారు. కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ ఎన్నిక పట్ల పలువురు, సంఘం పెద్దలు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

భూముల రీసర్వేకు సహకరించాలి

అదనపు కలెక్టర్ రాజాగౌడ్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 17 జనం సాక్షి:



భూముల రీసర్వే నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను పురస్కరించుకుని మాక్లూర్ మండలం లక్కాపూర్ లో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వే జరిపిస్తోందని అన్నారు. రీ సర్వేతో భూముల సరిహద్దు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రీ సర్వే కు సహకరించాలని కోరారు. అయితే సర్వే చేసే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, తహసీల్దార్ శేఖర్, స్థానిక అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో

ఘనంగా గోపాష్టమి వేడుకలు

వేములవాడ, నవంబర్ 17 (జనంసాక్షి):

కార్తీక శుద్ధ అష్టమి (గోపాష్టమి) పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని శ్రీ గాయత్రి దేవాలయంలో గోపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రాసం సమర్పించారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ గోసంరక్షణకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ నూతన గోరక్ష ప్రముఖ్‌గా గన్నమనేని ప్రదీప్ రావు నియమితులైనట్లు నాయకులు ప్రకటించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం జీ, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల రాము గౌడ్ కు గన్నమనేని ప్రదీప్ రావు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు



నాగుల రాము గౌడ్, వేములవాడ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గుండోజు గోపాల్ తో పాటు సనుగుల భాస్కర్, తిప్పర్తి సాయి కృష్ణ, తిప్పర్తి రమేష్, దండి గణేష్, కొక్కు గోపాలకృష్ణ, నంది శివ కుమార్, తదితర కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పెన్షన్ మంజూరు

కలెక్టర్ గరిమ అగ్రవాల్

ముస్తాబాద్ నవంబర్ 17 (జనంసాక్షి):

అర్హులందరికీ చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ముస్తాబాద్ మండలంలోని 625 మంది లబ్ధిదారులకు పెన్షన్ అర్హత ముస్తాబూరు పత్రాలను ముస్తాబాద్ లోని ఫంక్షన్ హాల్ లో మంగళవారం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.చేయూత పెన్షన్ కోసం నఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం అధికారులతో విచారణ చేయించామని పేర్కొన్నారు. ఈ నెల 18 వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. జిల్లా మొత్తం 8,209, ముస్తాబాద్ మండలంలో 625 నూతన పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో 4 వేల వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు..ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షల విలువైన బీమా వర్తిస్తుందని, అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నెల రోజుల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలు కూడా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజి రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, తహసీల్దార్, ఎంపీడీఓ లచ్చాలు గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి , ఉపసర్పంచ్ తాళ్ల విజయ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి, దుబ్బాక రాజు, స్వామి వివిధ గ్రామాల సర్పంచులు మండల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు

గత ప్రశ్నా పత్రాలు సాధన చేయాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్

ముస్తాబాద్ (జనంసాక్షి):

పదో తరగతి విద్యార్థులు గత ప్రశ్నా పత్రాలు సాధన చేయాలని.. రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. ముస్తాబాద్ మండలం చీకోడు ప్రభుత్వ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గదిని పరిశీలించి.. నిర్వాహకురాలికి పలు సూచనలు చేశారు. కంప్యూటర్ గదిని పరిశీలించి.. విద్యార్థులతో మాట్లాడారు. ముందుగా సోలార్ ఫెన్సింగ్ ను ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు గణితం ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. గత ప్రశ్నాపత్రాలు సాధన చేయాలని పేర్కొన్నారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మిగు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా.. ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం.. అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, ఉప సర్పంచ్ హసీల్దార్ ఫారూఖ్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సహకార సంఘం అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి



సైదాపూర్ నవంబర్ 17 (జనంసాక్షి)
మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పిఎసిఎస్ చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ వెన్కేపల్లి, సైదాపూర్ సంగం పరిధిలో గల దుద్దెనపల్లి, జాగిరిపల్లి, వెంకటేశ్వర్లపల్లి, గొల్లగూడెం, పెర్కపల్లి, శివరాంపల్లి ,సర్వాయి పేట, ఘనపూర్, రాయికల్ తండా, రాయికల్ ,బొమ్మకల్ అమ్మనగుర్తి, గోడిశాల ,ఎల బోతారం, గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పిఎసిఎస్ అధ్యక్షులు .కొత్త తిరుపతి రెడ్డి ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల పండించిన ధాన్యం రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు రైతులకు క్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు ఈ కార్యక్రమంలో వెన్నంపల్లి సింగిల్ విండో చైర్మన్, పంతంగి రవీందర్ గౌడ్. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి , ఉపాధ్యక్షులు కలకోటి కిషన్ రావు ,డైరెక్టర్లు ఓలాద్రి మైపాల్ రెడ్డి,చాడ ప్రకాష్ రెడ్డి ,ఏలూరి నర్సిరెడ్డి, ఏలూరి తిరుపతిరెడ్డి, పల్లెని ప్రవీణ్ రావు,నమిండ్ల జమున, గుగులోతు లక్ష్మి,మరియు , జాగిరిపల్లి సర్పంచ్ తొంట రజనీకాంత్. వెంకటేశ్వర్ల పల్లి సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య,గొల్లగూడెం సర్పంచ్ బత్తుల మౌనిక, పెరికపల్లి సర్పంచ్ పోతరాజు భవిత, సర్వాయిపేట సర్పంచ్ పోలుస్వరూప. ఘనపూర్ సర్పంచ్ బాసరాజు రజిత, రాయికల్ తండా సర్పంచ్ శంకర్ నాయక్ ,రాయికల్ సర్పంచ్ చాడ అఖిల, బొమ్మకల్ సర్పంచ్ వేముల శ్రీకాంత్ ,అమ్మనగుర్తి సర్పంచ్ పదిరే రమేష్, గోడిశాల సర్పంచ్ జున్నూతుల రాజిరెడ్డి, ఎలబోతారం సర్పంచ్ నమిండ్ల ఏఎంసి డైరెక్టర్ లు ఎర్రల శ్రీనివాస్ ,పెద్ది తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ ,మిట్టపల్లి కిష్టయ్య మండల కొము రయ్య. పోలు ప్రవీణ్ కచ్చు రవీందర్,గుండవేణి లక్ష్మణ్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



వడ్ల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

గంభీరావుపేట నవంబర్ 17 జనంసాక్షి; రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండ రమేష్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మారుతి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆరు నెలల పాటు కష్టపడి పండించిన పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బియ్యం అక్రమ నిలువలపై తనిఖీలు చేపట్టాలి



భిక్కనూరు నవంబర్ 17 (జనంసాక్షి):
ఎల్ నినో పరిస్థితులను సాకుగా చూపుతూ రైస్ డిపోలు, రైస్ మిల్లర్లు సన్న రకం బియ్యం కృత్రిమ కొరత సృష్టించి వాటి ధరలను ఇష్టానుసారంగా పెంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని వాటి ప్రభావంతో సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తిస్తూ భిక్కనూరు పట్టణ కేంద్రానికి చెందిన, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ కామారెడ్డి జిల్లా పౌరసరపరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ సన్నారకం బియ్యం సాధారణంగా బీపీటీ.కెఎన్ఎం రకం బియ్యం కిలో 66 రూ. తెలంగాణ సోనా 74 రూ. హెచ్ఎంటి, జైశ్రీరామ్ 79 రూ ధరలకు లభించాల్సిందిగా మార్కెట్లో కొన్ని ప్రాంతాల్లో కిలో 90రూ.నుంచి 130 రూ వరకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు నాణ్యతలేని ఇతర సన్న రకం బియ్యం పేరుతో విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయని వారు పేర్కొన్నారు. రైస్ మిల్లులు రైస్ డిపోలో, గోదాముల్లో భారీగా సన్నారకం బియ్యం నిల్వ

○కిలో బియ్యం రూ 90 నుంచి రూ 130 వరకు అధిక ధరలతో అమ్మకాలు..
○ సామాన్యులపై అధిక భారం

ఉంచి మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా మార్కెట్ ధరలను ప్రభావితం చేస్తున్నారనే అనుమానాలను కూడా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సామాన్య మధ్యతరగతి కుటుంబాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని జిల్లా పౌరసరపరా అధికారులు, విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఈసందర్భంగా కోరారు అక్రమ నిల్వల గుర్తించిన పక్షంలో చట్టం ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న సన్న రకం బియ్యం ధరల ప్రభావం పేద మధ్యతరగతి కుటుంబాలపై భారం పడకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా నాణ్యమైన సన్నారకం బియ్యం అందుబాటులో ఉండే విధంగా పర్యవేక్షణ చేపట్టాలని ఈసందర్భంగా విజ్ఞప్తి చేశారు.

భారత్ సమ్మిట్‌లో విదేశీ రాజకీయ నేత వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలి..

డీజీపీ, రామగుండం పోలీస్ కమిషనర్‌కు వినతి..
భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ రాజకీయ ప్రతినిధుల జోక్యాన్ని సహించేది లేదు..

గోదావరిఖని, జనంసాక్షి :
'భారత్ సమ్మిట్ 2026' కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ (పి ఈ ఎస్) సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలు, కార్యక్రమంలో చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల మహేష్ కుమార్ డిమాండ్ చేశారు.భారత్ సమ్మిట్‌లో విదేశీ రాజకీయ ప్రతినిధి భారతదేశ అంతర్గత రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు చేయడం, 'వోట్ చోర్, గద్దీ ఛోడ్' వంటి రాజకీయ నినాదాలకు మద్దతుగా వ్యవహరించారనే అంశాలు తీవ్ర పరిశీలనకు అర్హమైనవని వినతిపత్రంలో పేర్కొన్నారు.అలాగే, ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా అనే విషయాన్ని పరిశీలించి, తప్పులు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులు, నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.డీజీపీ తో పాటుగా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝాకి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు సుల్వ లక్ష్మి నర్సయ్య, మిట్టపల్లి సతీష్ కుమార్, కొండపర్తి సంజీవ్, మడికొండ శ్రీనివాస్, మచ్చ విశ్వాస్, సిలివేరీ అంజి, ఈదునూరి చిరంజీవి, జనగామ శివరాం తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే సింగరేణి పరిరక్షణ యాత్ర :టిబిజికెస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జనంసాక్షి :
స్థానిక టిబిజికెస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అన్ని ఏరియాలకు చెందిన కేంద్ర కమిటి నాయకులు పాల్గొన్నారు.మంగళవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా టీబీజీకే అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం కారణంగా సింగరేణి కార్మికులు అనేక హక్కులు కోల్పోయే పరిస్థితి దాపురించింది.కార్మికులకు ఉత్పత్తి కి కావలసిన కనీస పనిముట్లు .పరికారాలు .రక్షణ సామాగ్రి ని కూడా అందించలేక పోవడంతొ ఉత్పత్తి కుంటు పడుతుంది.నిత్యం ప్రమాదాల పరంపర కొనసాగుతుంది.కొత్త హక్కులు దేవుడెరుగు ఉన్న హక్కులు ఒక్కొక్కటి పోతున్నాయి.సింగరేణి కి నూతన బొగ్గు గనులు రాకపోవడం ఉన్న గనులు మూతపడుతుండటం వలన సంస్థ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.యాజమాన్యం తొ పోరాడాల్సిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కెవలం పైరవీలకె పరిమితమై కార్మికులకు అన్యాయం చేస్తున్నాయి.గుర్తింపు కాల పరిమితి పూర్తి అయిన కూడా చందాలకు అలవాటు పడిన పి ఐటియుసి ఎన్నకలంటేనే గజగజలాడుతూ అదికార పీటాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది.గుర్తింపు సంఘ నాయకులు ఫ్రీ మస్టర్లు పడుతూ కార్మికుల సమస్యల పై నోరెత్తడం లేదు.పోరాటాల ద్వారానే హక్కులు సాదించబడతాయి అని టిబిజికెస్ భావిస్తుంది.దానిలో భాగంగా టిబిజికెస్ కార్మిక హక్కుల సాదనకు చెపట్టబోయె కార్యక్రమాలలో కార్మికులందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ. సమావేశం పలు అంశాలు సమస్యలపై తీర్మాణాలు చేయడం జరిగింది.సింగరేణి సంస్థకు జెన్కొ ట్రాన్ స్కొ నుంచి రావలసిన 60 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి.12 వ వేజ్ బోర్డ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి.వేజ్ బోర్డు అగ్రిమెంట్ అయ్యె వరకు 40% ఐఆర్ కార్మికులకు చెల్లించాలి.వేలంతో సంబందం లేకుండా సింగరేణికి నేరుగా గనుల కేటాయింపు చేయాలి.సింగరేణి లోని హాస్పటల్ లలో నాణ్యమైన వైద్యం అందించాలి. కార్మికులకు ప్రభుత్వ హామి మేరకు 250 గజాల స్థలం కేటాయింపు చేయాలి20 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలి. 2019 నుండి డిస్మస్ కార్మికులకులందరికి ఎలాంటి షరతులు లేకుండా తీసుకోవాలి. 2026 లో డిస్మస్ అయిన వారికి పరగణలోకి తీసుకోవాలి.మారుపేర్ల సమస్యను వెంటనే



పరిష్కరించాలి.వేయిటింగ్ లో ఉన్న 300 మంది డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలివ్వాలి.సింగరేణి లో కొరత ఉన్న పనిముట్లు మరియు స్పేర్స్ కొనుగోలు చేయాలి.ప్రతినెల మెడికల్ బోర్డు ఎర్పాటు చేసి బోర్డ్ కి పెట్టుకున్న కార్మికులందరిని అన్ పిట్ చేయాలి.
సింగరేణి కార్మిక వాడలలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి,క్వార్టర్ ల నిర్వహణ మెరుగుపర్చాలి.
పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లు ఇంటర్నల్ క్లరికల్ తదితర పరిక్షలను వెంటనే నిర్వహించాలని తీర్మాణించారు.అనంతరం కేంద్ర కమిటి వివిద ఎరియాలలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు.ఈ సమావేశంలో ప్రదాన కార్యదర్శులు కాపు క్రుష్ణ, కెతిరెడ్డి సురెందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి , సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య, పర్లపల్లి రవి, మంగిలాల్ , చెల్పూరి సతీష్ , బడికెల సంపత్, ప్రభాకర్ రెడ్డి,వడ్డెపల్లి శంకర్, అయిలి శ్రీ నివాస్ నాగెల్లి సాంబయ్య, అన్ని ఎరియాల కేంద్ర కమిటి నాయకులు పాల్గొన్నారు.